క్లుప్తంగా

విఘ్నేశ్వరుని సన్నిధిలో ప్రముఖ సినీ దర్శకుడు



సినీ దర్శకుడు బోయపాటి శ్రీనుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బోయపాటి శ్రీనును వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు.

గణేష్ కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని దేవరపల్లి శివారు కమ్మరిపాలెంకు చెందిన దాసరి గణేష్ కుటుంబ సభ్యులను మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. గోపాలపురం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ

రావులపాలెం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హెచ్ఎం ఎం.సుబ్బరాజు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో కాకినాడ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, విద్యా ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ ఎ.సత్యశిరీష యువతీయువకులకు వ్యక్తిత్వ వికాసం, విద్యా ఉద్యోగ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

మామిడికుదురు: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు జయంతి పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల నుంచి విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'పై అవగాహన

అంబాజీపేట: ఈ ఏడాది మార్చి 18 నుంచి చేపట్టే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై మూడు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ తెలిపారు. మొసలపల్లి, ఇరుసుమండ, ముక్కామల గ్రామాల్లో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. సచివాల కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.


ఆలయ పునర్నిర్మాణానికి రూ.30 వేల విరాళం

సఖినేటిపల్లి: మండలంలోని గొంది రామాలయం పునర్నిర్మాణానికి మంగళవారం ఉండి కేంద్రంగా ఉన్న నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ రూ.30 వేలు విరాళం అందజేసింది. ఈ మేరకు గ్రామంలోని ఆలయ కమిటీకి ట్రస్ట్ చైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ పై మొత్తాన్ని అందజేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థికసాయం

ఆలమూరు: అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన ముద్రగడ అరుణకుమారి వైద్యం నిమిత్తం సర్పంచ్ నేలపూడి లావణ్య మంగళవారం రూ.పది వేల ఆర్థికసాయం అందించారు.

అంతర్వేది బీచ్‌లో మృతదేహం



సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌కు మంగళవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం కొట్టుకు వచ్చింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లారు. అతడి వయసు 60కి పైబడి ఉంటుందని, మెడలో పూసల దండ, ఎడమ చేతికి నలుపు రంగు వాచీ ఉందన్నారు. కుడి చేతికి ఎరుపు రంగు తాడు ఉందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సబలగా.. సాధికారికంగా..

- నేడు మహిళా దినోత్సవం
- కుటుంబం భారం మోస్తున్న మహిళలు
- స్వయం సాధికారత దిశగా ముందుకు

మామిడికుదురు: మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో పయనించాలని రాష్ట్ర ప్రభుత్వం వారికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా అన్నింటా వారికి ప్రాధాన్యం కల్పిస్తోంది. గ్రామ సచివాలయ ఉద్యోగాలతో పాటు, వలంటీర్ల నియామకంలోనూ పురుషుల కన్నా మహిళలకే ఎక్కువ ఉద్యోగాలు కల్పించింది. వీటితో పాటు నామినేటెడ్ పదవుల్లో సైతం వారికే ఎనలేని ప్రాధాన్యతనిస్తూ మహిళా సాధికారత దిశగా ముందుకు వెళ్తోంది. ఆ విధంగా ఉద్యోగాలు చేస్తున్న మహిళలు నేడు కుటుంబ బాధ్యతలను తమ భుజ స్కంధాలపై వేసుకుని అభివృద్ధి పయనంలో సాగుతున్నారు. ఆ కోవకు చెందిన పలువురి వృత్తాంతాలను ఒకసారి మననం చేసుకుందాం.

సర్పంచ్ అయినా వృత్తిని వీడలేదు

అలమూరు మండలంలోని పెనికేరు గ్రామానికి చెందిన వనుం చిన్నావతి వెనుకబడిన తరగతుల వర్గానికి చెందిన సాధారణ మహిళ. రెండు దశాబ్దాలుగా ఆమె తన భర్త జార్జితో కలసి ఇంటి ఆవరణలో సాయంకాలం బజ్జీల దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అదే క్రమంలో తనకున్న సంపాదనలో కొంత మేర పేద, మధ్య తరగతి కుటుంబాలకు వీలైనంత సహాయ సహకారాలు అందిస్తూ, ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ గ్రామస్తుల మన్ననలు పొందారు. ఈ క్రమంలో సర్పంచ్‌గా పోటీచేసి గెలుపొందారు. సర్పంచ్‌గా ఓ పక్క తన విధులు నిర్వహిస్తూనే మరో బజ్జీల బండిని నిర్వహిస్తున్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని ఆమెను చూస్తేనే అవగతమవుతోంది. సర్పంచ్‌గా, గృహిణిగా, కార్మికురాలిగా త్రిపాత్రభినయం చేస్తున్న చిన్నావతి నేటి యువత ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.



పెనికేరులో బజ్జీల తయారీలో నిమగ్నమైన సర్పంచ్ చిన్నావతి



మలికిపురం సమాఖ్య కార్యాలయంలో మహిళా దినోత్సవం

మహిళా ఉద్యోగులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బి.దొడ్డవరంలో సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి కోటయ్య, పీవీఆర్కే రాజు, స్థానిక పెద్దలు పసుమర్తి నానాజీ, శ్రీరామ్మూర్తి, జల్‌జీవన్ మిషన్ కోనసీమ సేవా మండలి సభ్యులు బొంతు చందు, బి.రమణ పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా అధికారులు ఈవోపీఆర్డీ బి.మంగాదేవి, ఐసీడీఎస్ శాఖ నుంచి ఎం.చంద్రలను సత్కరించారు. మహిళలకు ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్ ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సమాఖ్య మండల అధ్యక్షురాలు జి.సుమలత, కార్యదర్శి కె.శిరీష, కోశాధికారి జి.కమలకుమారి, ఏపీఎం వరాలబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబానికి దిక్సూచిగా...



లూటుకుర్రు గ్రామానికి చెందిన వనం రోజాదుర్గది నిరుపేద కుటుంబం. ఆమె ప్రస్తుతం ఆదుర్రు గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తుంది. ఎంతో కష్టపడి చదివించిన తండ్రి నాగిశెట్టి గత ఏడాది అక్టోబర్‌లో మరణించాడు. అక్క వివాహం చేసుకుని అత్తారింటికి వెళ్లడంతో కుటుంబ భారం రోజాదుర్గపై పడింది. ఉద్యోగం ద్వారా వచ్చే ఆదాయంతో తల్లి శ్రీదేవిని చూసుకుంటూ ఆ కుటుంబానికి రోజాదుర్గ దిక్సూచిగా నిలిచింది.

– రోజాదుర్గ

వైకల్యాన్ని లెక్క చేయకుండా..



పెదపట్నంలంకకు చెందిన మల్లాడి వెంకటరమణ అప్పనపల్లి సచివాలయంలో గ్రేడ్–2 హార్టీకల్చర్ అసిస్టెంటుగా పని చేస్తోంది. ఆమె నిరుపేద కుటుంబానికి చెందిన వికలాంగురాలు. తండ్రి కృష్ణమూర్తి కార్పెంటర్‌గా పని చేస్తూ కూతుర్ని ఎంతో కష్టపడి చదివించాడు. ముగ్గురు అక్కలకు పెళ్లి కావడంతో తల్లి బాపనమ్మ బాధ్యత వెంకటరమణపై పడింది. వైకల్యాన్ని ఏ మాత్రం లెక్క చేయకుండా మూడు చక్రాల వాహనంపై వెళ్లి ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆధారంగా నిలిచింది.

– మల్లాడి వెంకటరమణ

వలంటీర్‌గా పని చేస్తూ...



నగరం గ్రామానికి చెందిన షేక్ తస్లిమా ఫాతిమా అదే గ్రామంలో వలంటీర్‌గా పని చేస్తోంది. ఆమె పేద కుటుంబానికి చెందినది. తల్లి హీరాజాన్ గృహిణి. వారి కుటుంబానికి ఏ ఆధారం లేదు. వలంటీర్‌గా పని చేయడం ద్వారా వచ్చే ఆదాయమే వారికి జీవనాధారంగా నిలిచింది. తల్లితో పాటు వలంటీర్‌గా కష్టపడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలతో ఆ ఇద్దరూ కుటుంబాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నారు.

– షేక్ తస్లిమా ఫాతిమా

తల్లి సంరక్షణ చూస్తూ...



రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన ముస్కూడి సునీత నగరం–2 గ్రామ సచివాలయంలో గ్రేడు–2 ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఆమె తండ్రి గంగాచలం చనిపోవడంతో తల్లి దుర్గతో పాటు చదువుకుంటున్న తమ్ముడు ప్రదీప్ సంరక్షణ చూసుకోవల్సిన బాధ్యత సునీతపై పడింది. వీరికి ఏవిధమైన ఆస్థి పాస్తులు లేవు. భర్త దుర్గారావుతో కలిసి అటు పుట్టినింటికి, ఇటు మెట్టినింటికి సునీత సంరక్షకురాలిగా నిలిచింది.

– ముస్కూడి సునీత

ఇసుక రేణువులతో మహిళా చిత్రాలు



ఇసుక రేణువులతో తయారు చేసిన మహిళల బొమ్మలు

మామిడికుదురు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు ఇసుక రేణువులతో రూపొందించిన మహిళా చిత్రాలు అబ్బుర పరుస్తున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నాగప్రసాద్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో విద్యార్థినులు ఇసుక రేణువులతో జీవకళ ఉట్టి పడే విధంగా మహిళల చిత్రాలను అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ చిత్రాలను రూపొందించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

వాగ్దానం ఇచ్చి.. అమలు చేసి

అయినవిల్లి: ఎన్నికల్లో ప్రజలకు చెప్పింది చెప్పినట్లు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత రాష్ట్రం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆ ధీమాతోనే వచ్చే 2024 ఎన్నికల్లో సీఎంగా మరలా జగనే అవుతారని ఆయన అన్నారు. మంగళవారం మండలంలోని వెలువలపల్లి, మడుపల్లి, సిరిపల్లి, మాగాం గ్రామాల్లో మార్చి 18వ తేదీన జరగబోయే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, బొంతు మణి, కుడుపూడి శాంతావతి, కాశీ వీవీ సత్యనారాయణ, యడ్ల కిరణ్‌బాబు, మట్టపర్తి వెంకటరమణ, కుడుపూడి విద్యాసాగర్, గుత్తుల నాగబాబు, బొంతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఉమ్మడి గోదావరి జిల్లాల జోనల్ గ్రీవెన్స్ సెల్ ఇన్‌చార్జిగా నియమితులైన పేరి శ్రీనివాసరావును మడుపల్లిలో ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా సిరిపల్లి పలువురు మహిళా ప్రతినిధులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శాలువా వేసి సత్కరించారు.



మడుపల్లిలో గృహసారథులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కొత్తపేట: సమాజంలో సగభాగం వున్న మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాపాడుకుంటూ ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు మహిళలకు పిలుపునిచ్చారు. ముందస్తు ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల విమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ టి.రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం డీటీ కె.లక్ష్మి, ఏఎస్‌డబ్ల్యూ ఎ.వెంకటలక్ష్మి, అధ్యాపకులు జి.మాధురి, సీహెచ్ రత్నలత, టి.రమాదేవి, సీహెచ్ నాగరాణి, నాగశ్రీలక్ష్మి, ఎ.దీపికాదేవి, నాగదీపిక, భ్రమరాంబ, అరుణసుందరి, సువార్తమ్మ, నాగజ్యోతి, ప్రసన్నజ్యోతి, సాయిలక్ష్మి, భవాని, కావ్య, ఉపాధ్యాయినులు రమాదేవి, సువర్ణ, నిర్మల, ధనలక్ష్మి, కల్యాణిలను కళాశాల తరఫు ప్రిన్సిపాల్ ఘనంగా సత్కరించారు. అలాగే మండల సమాఖ్య– వైఎస్సార్ క్రాంతిపథం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద వీఓలు మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఏపీఓ పి.విశ్వనాథం ఆధ్వర్యంలో వీఓఏలకు ముగ్గులు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయిలో ఉత్తమ వీఓఏగా రామానుజమ్మ (అవిడి)ని ఎంపిక చేసినట్టు ఏపీఓ తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు.



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మహిళా అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులతో ప్రిన్సిపాల్ పెద్దిరాజు

వైభవంగా వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు మంగళవారం స్వామికి మహాశాంతి హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. స్వామికి వసంతోత్సవం, కంకణ విమోచన చక్రస్నానం జరిపారు. రాత్రికి స్వామికి భ్రమరణోత్సవం ద్వాదశప్రదక్షిణలు దేవాలయం చుట్టూ స్వామి ఉత్సవ మూర్తులతో 12 రకాల ప్రదక్షిణలు జరిపారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

మామిడికుదురు: ఐదు రోజుల పాటు వైభవంగా జరిగిన మాకనపాలెం అనంతలక్ష్మి భూదేవీ సమేత సత్యనారాయణస్వామి వారి 71వ దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు మంగళవారం చక్రస్నానంతో సంపూర్ణమయ్యాయి. చివరి రోజు కావడంతో స్వామి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. స్వామికి అభిషేకాలు చేయించారు. శ్రీలక్ష్మి గుండంలో శ్రీస్వామి వారి చక్రస్నానం ఆద్యంతం కనుల పండువగా జరిగింది. బాణసంచా కాల్పులు, మేళ తాళాలు, భక్తుల కోలాహలం నడుమ చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పొన్నవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి దర్శనానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, పార్టీ నాయకులు హాజరయ్యారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే నిత్య అన్నదాన పథకానికి దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంకు చెందిన డి.మహేష్ రూ.25 వేలు విరాళం అందించినట్లు ఈవో సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

ఘనంగా నూకాంబిక కొత్తపూలు ఉత్సవాలు

ఆలమూరు: కోస్తా జిల్లాలోని భక్తులు ఇలవేల్పుగా కొలిచే మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థం సందర్భంగా నిర్వహిస్తున్న కొత్తపూలు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈవో ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏటా మాదిరిగానే స్థానిక అమ్మవారి ఆలయంలో మన్యసీమ నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలను పెద్దగరగకు అలంకరించి సోమవారం రాత్రి తొలి విడత కొత్తపూల ఉత్సవాలను నిర్వహించారు. ఈనెల 19 వరకూ రోజు విడత రోజు కొత్తపూలు ఉత్సవాలు జరగనున్నట్లు ఈఓ తెలిపారు. అలాగే మండలంలోని బడుగువానిలంకలో కర్రెమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. రెండేళ్లకోసారి నిర్వహించే జాతర పురస్కరించుకుని అమ్మవారిని ఆలయం నుంచి గరగ రూపంలో పుట్టింటికి వచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం నిర్వహించిన తీర్థోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అడబాల వారి ఆడపడుచుగా, దూలం వారి కోడలుగా, యెరుబండి వంశీయుల మనవరాలిగా అమ్మవారిని కీర్తించడం ఆ గ్రామంలో ఆనవాయితీ.

గ్రీవెన్స్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస్



అంబాజీపేట: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా పేరి శ్రీనివాస్ నియమితులైయ్యారు. ఈ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన మంగళవారం తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణు, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యేలు చిట్టిబాబు, పొన్నాడ సతీష్‌కుమార్‌లకు శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌ను కె.ఆదిత్యకుమార్ అభినందించారు.

సాగునీటి కోసం కౌలు రైతుల నిరసన

మామిడికుదురు: వరి చేలు ఈనిక దశలో ఉన్న తరుణంలో సాగునీటి సమస్య జటిలంగా ఉందంటూ ఈదరాడ గ్రామానికి చెందిన కౌలు రైతులు మంగళవారం నిరసన తెలిపారు. ఈనిక దశలో ఏర్పడిన సాగునీటి సమస్య వల్ల తెల్ల కంకులుగా మారిపోతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.25 వేలు పెట్టుబడి పెట్టామని సాగునీరందక పంట పొలాలు నెర్రలు తీస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపఎన్నికపై అఖిలపక్ష సమావేశం

మామిడికుదురు: మగటపల్లి ఎంపీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో గ్రామంలో ప్రస్తుతం ఉన్న మూడు పోలింగ్ బూత్‌లపై పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్థానికుల నుంచి ఏ విధమైన అభ్యంతరాలు రాకపోవడంతో ఈ నెల 10వ తేదీన పోలింగ్ కేంద్రాలపై చివరి పబ్లికేషన్ జరుగుతుందని ఎంపీడీఓ చెప్పారు.

స్వరాష్ట్రానికి కార్మికుల తరలింపు

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలోని ఒక ఇటుకబట్టీలో పనిచేస్తున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కార్మికులను రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు స్వరాష్ట్రానికి తరలించారు. వివరాలలోకి వెళితే స్థానిక ఏటిగట్టు దిగువన ఉన్న బట్టీలో ఛత్తీస్‌ఘడ్ నుంచి సుమారు 25 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అయితే ఆ యజమాని సక్రమంగా కూలి చెల్లించకపోవడంతో కూలీలు అమలాపురంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఐపి శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ సంబంధిత బట్టీ యజమానితో మాట్లాడి ఇరువర్గాల సమస్యలను సామరస్యంగా పరిష్కరించారు. సోమవారం రాత్రి ప్రత్యేక వాహనంలో ఆ కూలీలను రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు తరలించారు. పంచాయతీ కార్యదర్శి పాలింగి రాజు, వీఆర్ఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతరను పురస్కరించుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందించాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి కోరారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ముఖ మండప ఆవరణలో అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల నిర్వహణపై మంగళవారం సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు అధ్యక్షత వహించగా ఆర్డీవో ముక్కంటితో పాటు జిల్లా దేవదాయ సంయుక్త కమిషనర్ ఎంవీ సురేష్‌బాబు, ఉప కమిషనర్ ఎం.విజయరాజు, డీఎల్‌పీఓ రామకృష్ణారెడ్డి, అడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత, రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నరసింహారావు, ఫైర్ ఇన్‌స్పెక్టర్ హనుమంతరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత తీర్థంలో పారిశుద్ధ్య కల్పనకు తీసుకోబోతున్న చర్యలపై సర్పంచ్ మార్గని కరుణ, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపి శెట్టి, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఉచిత పార్కింగ్ తప్పనిసరి

సుదూర ప్రాంతాల నుంచి వాహనాలపై వచ్చే భక్తులకు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో ముక్కంటి వివిధ శాఖాధికారులను ఆదేశించారు. దేవదాయశాఖ ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో ఉచితంగా వాహనాలను నిలుపుకోవాలని ఆయన సూచించారు. పార్కింగ్‌కు రుసుం వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉప సర్పంచ్ మోరంపూడి వాసు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



చింతలూరులో తీర్థత్సవాలపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో ముక్కంటి తదితరులు

31నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు మార్చి 31 నుంచి ఏప్రిల్ 7వ వరకు నిర్వహిస్తామని ఆర్డీవో ఎం.ముక్కంటి మంగళవారం తెలిపారు. కల్యాణోత్సవాల ఏర్పాట్లపై చైర్మన్ ఆర్.రమేష్‌రాజు అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఆర్డీవో ప్రసంగించారు. సర్పంచ్ పి.బాబురావు, ఎంపీడీవో, తహసీల్దారు, అధికారులు పాల్గొన్నారు.

ర్యాలి లంక భూముల పరిశీలన

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో జిల్లా జేసీ ధ్యానచంద్ర మంగళవారం లంక భూముల్లో పర్యటించారు. లంక భూమిని, సాగులో ఉన్న రైతులకు లీజు పట్టాలు మంజూరు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బందితో కలసి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్ఐ భవానీ తదితరులు పాల్గొన్నారు.